



Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్






అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 32 | బుధవారం 09 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


- వాణిజ్యం నుంచి ఏఐ వరకు ఫోకస్
- 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు
- 11 సభ్య దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌కు భారత్ నాయకత్వం
- ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, అభివృద్ధి ఫైనాన్స్‌పైనా చర్చలు

# బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

వాణిజ్యం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వరకు బ్రిక్స్ వేదికగా భారత్ తన ఎజెండాను ప్రపంచం ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. బ్రిక్స్ కూటమికి 2026లో అధ్యక్షత వహిస్తున్న భారత్ ఈనెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణం, అంతర్జాతీయ పాలనలో మార్పులపై కీలక చర్చలు జరపనుంది. అదే సమయంలో బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది. సంక్షోభాలను తట్టుకునే ఆర్థిక వ్యవస్థలు, కొత్త సాంకేతికత, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధి, ఆ నాలుగు అంశాల చుట్టూ బ్రిక్స్ సదస్సును ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. దీనికి హ్యూమానిటీ ఫస్ట్ అనే దృక్పథాన్ని జోడించింది.బ్రిక్స్‌లో భారత్ ప్రధానంగా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలను తగ్గించడం, అంతర్జాతీయ చెల్లింపులను సులభతరం చేయడం ఇందులో కీలకం. జాతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను మరింత అనుసంధానం చేయడం వంటి అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను మరింత పటిష్టం చేయడం భారత్ ఎజెండాలో ముఖ్యమైన అంశం. అంతేకాక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా బ్రిక్స్ సహకారం అందించాలనేది లక్ష్యం. ఇందుకోసం ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ విధానం, ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక సహకార పోర్టల్ వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది.

**బ్రిక్స్‌లో ఏఐ సహకారానికి ప్రాధాన్యం**

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను





## కేంద్ర మంత్రులతో మోదీ అర్ధరాత్రి భేటీ..

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

కేంద్ర కేబినెట్ ప్రక్షాళనపై ప్రధాని మోదీ కసరత్తు కొనసాగుతున్న వేళ, కేంద్ర సహాయ మంత్రులు, స్వతంత్ర హోదా మంత్రులతో అర్ధ రాత్రి కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన భేటీలో శాఖల పనితీరు, 'వికసిత్ భారత్ 2047' ప్రణాళికలు, రాబోయే ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజల కోసం చేసిన పనిని నిరూపించుకోవాలని మంత్రులకు సూచించిన మోదీ, సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు, సోషల్ మీడియా స్పందనపై కూడా సమీక్ష నిర్వహించారు.

- వరదలొచ్చి.. 14 రోజులైనా.. తెలియని ఆచూకీ
- 1,357కు చేరిన మృతుల సంఖ్య
- కొనసాగుతున్న రెస్క్యూ బృందాల సెర్చింగ్

# నేపాల్‌లో దొరకని 5వేల మంది

**ఢాకా- సూర్య వాస్తవం:**

నేపాల్ వరదలతో సొరంగాల్లో చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం 14వ రోజు కూడా సెర్చ్ ఆపరేషన్‌ను సహాయక బృందాలు కొనసాగించాయి. ఇప్పటివరకు 1,357 మంది మృతి చెందగా, 13వేలమందికి పైగా సురక్షితంగా రక్షించారు. ఇంకా 5వేలమంది గల్లంతయ్యారు. ఇందులో 587 మంది విదేశీయులున్నారు. గల్లంతైన వారిపై ఇక ఆశలు వదులుకోవాల్సిందేననే అభిప్రాయాలు వినబడుతున్నాయి. ఏడు వేర్వేరు జల విద్యుత్ ప్రాజెక్టుల వద్ద సొరంగాలలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్, భారత్ రెస్క్యూ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. క్యాలెండర్‌లు ఎంచుకోండి చిలిమే జలవిద్యుత్ ప్రాజెక్టులో చిక్కుకు పోయిన ఆరుగురిని రక్షిం చేందుకు భారత్, నేపాల్ 35 మంది



- మిగతా 2లో..



## రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ..

- నేటి నుంచి రెండు రోజుల పర్యటన
- జిల్లా అభివృద్ధి కమిటీ (దిశ) సమావేశానికి అధ్యక్షత వహించనున్న రాహుల్ గాంధీ
- శివ్‌గఢ్, మహారాజ్‌గంజ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన
- యూపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్న పర్యటన

**రాయ్‌బరేలీ - సూర్య వాస్తవం**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ నేడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ పార్లమెంటరీ

- మిగతా 2లో..



## వైద్యులపై దాడులు అమానుషం

## - సుప్రీంకోర్టు సీరియస్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

మహారాష్ట్రలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బందిపై రాజకీయ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్న ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసులను తేలికగా తీసుకోలేమని,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

# పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**ఆమరావతి - సూర్య వాస్తవం**

ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడం పై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపు నిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులు కుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

**ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..**

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా

- మిగతా 2లో..



## తమిళనాడు అసెంబ్లీలో రచ్చరచ్చ

- ఈఎంఐల రూపంలో లంచాలు.. వ్యాఖ్యలపై గరంగరం
- సీఎం విజయ్ ఆరోపణలను రికార్డుల్లోంచి తొలగించాలి
- నినదించిన డీఎంకే సభ్యులు.. కుదురదన్న స్పీకర్
- పోడియం వద్దకు దూసుకువెళ్లిన సభ్యులు
- డీఎంకే ఎమ్మెల్యేలను బయటికి ఎత్తుకెళ్లిన మార్షల్స్

**చెన్నై - సూర్య వాస్తవం**

తమిళనాడులో గత డీఎంకే ప్రభుత్వంపై అసెంబ్లీ వేదికగా సోమవారం సీఎం విజయ్ చేసిన అవినీతి ఆరోపణలు, విమర్శలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. గత ప్రభుత్వం పాలనలో లంచాలు ఈఎంఐల రూపంలో తీసుకున్నారన్న వ్యాఖ్యలపై సభ అట్టుడికింది. అధికార టీవీకే, ప్రతిపక్షం మధ్య సర్కారియా కమిషన్, మీసా ప్రస్తావనపైనా ఆగ్రహ మంటలు చెలరేగాయి. సీఎం వ్యాఖ్యల రికార్డులను ఎట్టిపరిస్థితుల్లోనూ సభ నుంచి తొలగించాలని డీఎంకే సభ్యులు మంగళవారం అసెంబ్లీలో తీవ్రనిరసన తెలిపారు. స్పీకర్ ససేమిరా అనడంతో తాము కూడా తగ్గేదేలే అంటూ.. పోడియం వద్దకు దూసుకెళ్లారు. ప్రతిపక్షం నిరసనల హోరుతో సభంతా రచ్చరచ్చగా

- మిగతా 2లో..

# నేపాల్‌లో దొరకని 5 వేల మంది

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుల బృందం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సొరంగం పొడవు మొత్తం 250 మీటర్లుండగా, 130 మీటర్ల దూరం సహాయక బృందాలు చేరుకున్నాయి. లాంగ్టాంగ్ జల విద్యుత్ ప్రాజెక్టు, అప్పర్ త్రిశూలి, మెలుంగ్ ఖోలా, త్రిశూలి 3ఏ, త్రిశూలి 3బీ ప్రాజెక్టులలో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. మరోవైపు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు కారణమవుతున్న దేశాలు నేపాల్‌కు నష్టపరిహారం, పునర్నిర్మాణానికి రూ.189 కోట్లు చెల్లించాలని ఐక్యరాజ్యసమితిని విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ కోరారు. కాగా గల్లంతైన భారతీయుల బంధువుల నుంచి డీఎన్ఏ నమూనాలను బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం అందజేయాలని తెలిపింది.

# రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ..

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో పర్యటించ నున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును రాహుల్ సమీక్షించనున్నారు. ముఖ్యంగా ఇటీవల సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారులను ఆరా తీయనున్నారు. అమేథీ ఎంపీ కిశోరీ లాల్ శర్మ అధ్యక్షతన గతంలో జరిగిన 'దిశ' సమావేశం అనంతరం చేపట్టిన చర్యలపై అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. అనంతరం రాహుల్ గాంధీ శివ్‌గఢ్, మహారాజ్‌గంజ్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, వరద నష్టాన్ని స్వయంగా అంచనా వేయనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాహుల్ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించేందుకు ఈ పర్యటన దోహదపడనుంది.

కాగా, రాహుల్ గాంధీ చివరిసారిగా ఈ ఏడాది మే 19, 20 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో పర్యటించారు. ఆ సమయంలో రాయ్‌బరేలీలోని బచ్‌రావాన్‌లో తన ఎంపీ నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు.

## వైద్యులపై దాడులు

# అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

నిందితులను వెంటనే అరెస్ట్ చేసి స్వేచ్ఛగా తిరగని వ్వకూడదని స్పష్టం చేసింది. థాణేలోని డోంబివ్లి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై దాడి కేసులో అరెస్టైన శివసేన కార్పొరేటర్ రమేశ్ సుక్రియ మాత్రే బెయిల్ షరతులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

వైద్యులపై దాడుల ఘటనలు పెరుగుతున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. పాల్ఘర్‌లో ఆస్పత్రి సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడి ఘటనను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. సమాజానికి స్పష్టమైన సందేశం వెళ్లేలా నిందితులపై చర్యలు ఉండాలని పేర్కొంది. కాగా, తన అప్పీల్‌ను ఉపసంహరించు కుంటామని మాత్రే తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు తెలిపారు.

## వాట్సాప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

# పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

# మట్టి గణపతులను పూజిద్దాం...

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదాం...

### - కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపు

**తిరుపతి– సూర్య వాస్తవం**

నగర ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ఇతోధికంగా భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందిరామైదానం లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మంటపాల అనుమతుల మంజూరు హెల్ప్ లైన్ సెంటర్ ను మంగళవారం కమిషనర్ సందర్శించారు. వినాయక చవితికి మంటపాల అనుమతుల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలుపారు. నగరంలో వినాయక చవితి వేడుకలు భక్తిబావంతో జరుపుకునేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. చవితి వేడుకలు నిర్వహించే వారు మంటపాల ఏర్పాటుకు అన్ని విభాగాల అధికారుల కార్యాలయాలకు వెళ్లకుండా ఒకే చోట అన్ని అనుమతులు ఇచ్చేలా ఈ సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్వాహకులు అందరూ ఇక్కడ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. నగరంలో చవితి వేడుకల నిర్వహణపై ఇప్పటికే పలు సూచనలు, నిబంధనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అందరూ వాటిని తప్పకుండా పాటించాలని, భక్తి భావంతో ఆనందంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఉత్సవ కమిటి కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్, మాంగాటి గోపాల్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.




# అక్రమ రేషన్ బియ్యం అడ్డుకట్ట ఎప్పుడు..?

- ఉమ్మడి జిల్లాలో తారస్థాయికి చేరిన రేషన్ బియ్యం దందా
- ఉరవకొండ మండలంలో 1.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- ఆటోతో పాటు ఇద్దరిపై 6ఏ కేసు నమోదు

**ఉరవకొండ – సూర్య వాస్తవం :**

ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, కొనుగోళ్లకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ నిఘా, అధికారుల తనిఖీలు కొనసాగుతున్నప్పటికీ అక్రమార్కులు మాత్రం యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం అక్రమ దందాను పూర్తిస్థాయిలో నియంత్రించే శక్తి ప్రభుత్వ యంత్రాంగానికి లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉరవకొండ మండల పరిధిలోని శేక్షానుపల్లి గ్రామం పోలేరమ్మ గుడి ప్రాంతం వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న నాలుగు బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సుమారు 1.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, వీఆర్వో షేకావలి తెలిపారు. తహశీల్దార్ పి.జి. అరుణకు అందిన సమాచారంతో సివిల్ సప్లయిస్ అధికారులు పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లత్తవరం తండా ప్రాంతంలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించి లబ్ధి పొందేందుకు తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో మహిళ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**అక్రమ దందాకు చెక్ ఎప్పుడు?**

రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, రవాణా, విక్రయాలపై అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఈ దందా పూర్తిగా ఆగకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ బియ్యం సేకరణపై నిరంతర నిఘా పెట్టడంతో పాటు అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా మార్చుతున్న అంశాల్లో ఏఐ ఒకటి. అందుకే బ్రిక్స్‌లో కూడా ఏఐ సహకారానికి భారత్ ప్రాధాన్యమిస్తోంది. ఏఐతో పాటు ఫిన్‌టెక్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆధారిత వ్యవస్థలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచాలని భావిస్తోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు ప్రత్యేక రిపాజిటరీ ప్రతిపాదన కూడా ఉంది. భారత్‌కు ఇప్పటికే ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యవస్థల్లో అనుభవం ఉంది.

ఆ అనుభవాన్ని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడం ద్వారా సాంకేతికతను కేవలం అభివృద్ధి చెందిన దేశాలకే పరి మితం చేయకుండా గ్లోబల్ సౌత్‌కు అందుబాటు లోకి తీసుకురావాలన్నది భారత్ ఆలోచనగా కనిపిస్తోంది.

**స్టార్టప్‌లకూ ప్రాధాన్యం**

కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ దేశాల్లోని యువత, స్టార్టప్‌లను అనుసంధానం చేయడంపైనా భారత్ దృష్టి పెట్టింది. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి ప్రతిపాదనల ద్వారా కొత్త సంస్థలకు పెట్టుబడులు, సాంకేతిక సహకారం అందించే ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయంలో కూడా డిజిటల్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాలనేది భారత్ లక్ష్యం. ఏఐ, జియో స్పేషి యల్ టెక్నాలజీ, డిజిటల్ వ్యవస్థల సాయంతో రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా బ్రిక్స్ సహకారాన్ని పెంచాలని భావిస్తోంది.

**బ్రిక్స్ విస్తరణ తర్వాత భారత్‌లో సదస్సుకు మరింత ప్రాధాన్యం**

బ్రిక్స్ విస్తరణ తర్వాత భారత్‌లో జరగనున్న సదస్సుకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండోనేషియా మొత్తం 11 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో భారత్ అధ్యక్షత వహించడం కీలక సందర్భం. కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధనం, ఆరోగ్యం, వ్యవసాయం, వాతావరణం వంటి రంగాల్లో ప్రత్యక్ష ప్రయోజనాలు కల్పించే సహకారం అవసరమనే సందేశాన్ని భారత్ ఇవ్వాలని చూస్తోంది. ? అంతర్జాతీయ ద్రవ్య, రాజకీయ సంస్థల్లో సంస్కరణలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాధాన్యం, ఆర్థిక సమ్మిళితత్వం వంటి అంశాలను కూడా భారత్ బలంగా ప్రస్తావించనుంది.

ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా బ్రిక్స్‌ను మరింత బలమైన వేదికగా మార్చడమే భారత్ లక్ష్యంగా కనిపిస్తోంది. అందుకే ఈసారి బ్రిక్స్ సదస్సు కేవలం దేశాధినేతల సమావేశం మాత్రమే కాదు. ప్రపంచ వాణిజ్యం, టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌పై భారత్ తన ఆలోచనలను చెప్పే వేదికగా మారనుంది. సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే ఆ సదస్సులో వెలువడే నిర్ణయాలు, బ్రిక్స్ భవిష్యత్ దిశను కూడా నిర్దేశించే అవకాశం ఉంది.

# తమిళనాడు అసెంబ్లీలో రచ్చరచ్చ

(మొదటి పేజీ తరువాయి)

మారడంతో స్పీకర్ మార్షల్స్‌ను ఆదేశించారు. దీంతో డిఎంకే సభ్యులను బలవంతంగా అసెంబ్లీ హాల్ బయటికి తరలించారు. తమిళనాడు అసెంబ్లీలోసభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే, డీఎంకే విప్ ఈవీ వేలు సోమవారం నాటి ముఖ్యమంత్రి ప్రకటనను ప్రస్తావిస్తూ, అవినీతికి సంబంధించిన ఈడీ ఆరోపణల వంటి అంశాలపై సీఎం చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి నేరాలు రుజువు కాలేదని స్పష్టం చేసిన సర్కారియా కమిషన్ గురించి, మిసా(అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం) గురించి, మారన్ గురించి ప్రస్తావించడంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్‌పైను తీవ్రంగా విమర్శించారు. తమను తాము సమర్థించుకునే అవకాశం లేని వ్యక్తుల గురించి లేదా మరణించిన వారి గురించి చర్చించడం అనుచితమని ఆయన మండిపడ్డారు. ఆధారాలు లేకుండా ఈ విషయాన్ని ప్రస్తావించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే' అని ఆయన ఆగ్రహించారు. వివాదాస్పద వ్యాఖ్యలను, సభ బయట ఉన్న వ్యక్తులపై చేసిన నిరాధారమైన ఆరోపణలను అధికారిక శాసనసభ రికార్డుల నుంచి తొలగించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. అధికార పార్టీ సభ్యులు, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల వాడివేడి వాదనల జరిగాయి. అయితే ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తొలగించకూడదని స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ప్రకటించడంతో, డీఎంకే ఎమ్మెల్యేల నినాదాలు మార్మోగాయి. అనేకమంది డీఎంకే ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని నినదించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, అసెంబ్లీ అనేది రాజకీయ వేదిక కాదని గుర్తుచేస్తూ, సభ్యులు తమ స్థానాలకు తిరిగి వెళ్లి సభ గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ కోరారు. అయినా పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో గీఎంకే సభ్యులను చివరకు బయటకు పంపాలని స్పీకర్ మార్షల్‌సను ఆదేశించారు. దీంతో వారిని అసెంబ్లీ హాల్ నుంచి మార్షల్స్ బయటికి గెంటేశారు.

అనంతరం అసెంబ్లీ బయట ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చేస్తున్న ఆరోపణలపై ఆధారాలు ఉండాలని, రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యల నుంచి తప్పించుకోజూస్తున్నారని ఆరోపించారు. ఇటీవల తమిళనాడులో పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు మహారాజన్‌పై పాండియన్ అనే వ్యక్తి దాడి చేయగా ఆయన మృతి చెందాడు. దీనిపై డీఎంకే ఎంపీ కనిమొళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. టీవీకే ప్రభుత్వం రాష్ట్రంలో అసురక్షిత వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు.

# మట్కా జూదంపై
# పోలీసుల దాడి...!

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు.. రూ.1.81 లక్షల నగదు స్వాధీనం
- ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో పోలీసుల చర్యలు
- అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక : సిఐ కౌలుట్లయ్య



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా జూదం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మట్కా జూదానికి సంబంధించిన రూ.1,81,000 నగదు, మట్కా చీటీలు, రెండు బాల్‌పాయింట్ పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పి. జగదీష్, అనంతపురం అర్బన్ ఎస్‌డీపీఓ ఎం. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. కౌలుట్లయ్యకు అందిన ఖచ్చితమైన సమాచారంతో సిబ్బంది సహాయంతో ఈ దాడి నిర్వహించారు. ఈ దాడిలో మట్కా జూదానికి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**అరెస్టయిన వారి వివరాలు:**

1. అంకె రవి కుమార్ (42), తండ్రి వెంకటనారాయణ, బొమ్మేపర్తి గ్రామం, రాప్తాడు మండలం.
2. సుగాలీ సూర్య (45), తండ్రి సుగాలీ రాముడు, అశోక్‌నగర్, అనంతపురం నగరం.

మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. కౌలుట్లయ్య హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## - భజనలు, కోలాటం మధ్య శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు



**ప్యాపిలి- సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. త్రైత శాఖము-48లో భాగంగా, త్రిమత ఏకైక గురువు, త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు, కోలాటం తదితర కార్యక్రమాల మధ్య శ్రీకృష్ణుని ప్రతిమను గ్రామంలో పురవీధులో పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హుసేనాపురం శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు, సుధాకర్ నాయుడు, శివ శివ ప్రసాద్ మధు బావి పల్లి లింగన్న, జమల్ బాషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.






# పనిచేయని ప్రింటర్లు...

## - జిరాక్స్ సెంటర్లకు ప్రజల పరుగులు......

- సర్టిఫికెట్ల ప్రింట్ల కోసం జిరాక్స్ సెంటర్లకు ప్రజల పరుగులు
- సచివాలయాల్లో సౌకర్యాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతున్నాయంటున్న స్థానికులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం...

**కనేకల్ - సూర్య వాస్తవం :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాల్లోనే కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనేకల్ పట్టణంలోని 1వ 2వ గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పని చేయకపోవడంతో వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వివిధ ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు, దరఖాస్తులు, ఇతర అధికారిక పత్రాలకు సంబంధించిన ప్రింట్లు అవసరమైనప్పుడు సచివాలయంలోనే ప్రింట్ తీసుకునే అవకాశం ఉండాలి. అయితే ప్రింటర్లు పనిచేయకపోవడంతో ప్రజలను బయట ఉన్న జిరాక్స్ సెంటర్లకు పంపిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

### సచివాలయానికి వస్తే బయటకు పంపుతున్నారంటూ ఆరోపణలు

ప్రభుత్వ సేవల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజల్లో వృద్ధులు, మహిళలు, కూలీలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా ఉంటారు. ఒక చిన్న ప్రింట్ కోసం కూడా బయటకు వెళ్లాల్సి రావడంతో వారికి అదనపు సమయం, ఖర్చు భారం అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రింటర్ పనిచేయకపోవడం వంటి చిన్న సాంకేతిక సమస్యను కూడా వెంటనే పరిష్కరించకుండా రోజుల తరబడి అలాగే ఉంచడం వల్ల సచివాలయాల సేవలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా? ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందుతున్నాయా? అనే అంశాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే కనేకల్ పట్టణంలోని 1వ, 2వ వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోతున్న సమస్య అధికారుల దృష్టికి వెళ్లలేదా? లేక తెలిసినా పట్టించుకోవడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన సచివాలయాల్లోనే కనీస సాంకేతిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది.



### వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రజల డిమాండ్

పనిచేయని ప్రింటర్లను వెంటనే మరమ్మతు చేయించాలని, అవసర మైతే కొత్త ప్రింటర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలను అనవసరంగా బయట జిరాక్స్ సెంటర్లకు పంపకుండా, అవసరమైన అన్ని సేవలను సచివాలయం లోనే అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే సచివాలయాల్లో అందుబాటులో ఉన్న కంప్యూ టర్లు, ప్రింటర్లు, ఇతర పరికరాల పనితీరును ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ సేవలు సాంకేతిక సమస్యల కారణంగా బయటకు వెళ్లే పరిస్థితి రాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# డ్రగ్స్‌కు దూరంగా... భవిష్యత్తుకు దగ్గరగా!

- గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో పోలీస్ కళా-జాగ్రుతి బృందం నాటిక
- 'ఓ యువతా... మేలుకో'తో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన



**కడప - సూర్య వాస్తవం :** మాదకద్రవ్యాల మత్తులో యువత భవిష్యత్తు నాశనం కాకుండా కాపాడేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'ఓ యువతా... మేలుకో' పేరుతో పోలీస్ కళా--జాగృతి బృందం ప్రదర్శించిన నాటిక విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. బృందం ఇన్‌చార్జి జి. నరసరామ్ నేతృత్వంలో కళాకారులు నాటికలు, పాటల ద్వారా మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. డ్రగ్స్‌కు బానిసైతే విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం, వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు సమాజంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని చైతన్యపరిచారు.

### డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
### - చెన్నూరు సీఐ చాంద్ బాషా

ఈ సందర్భంగా చెన్నూరు సీఐ చాంద్ బాషా మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముకలాంటి వారని, మత్తుపదార్థాలకు ఆకర్షితులు కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, లక్ష్యసాధనపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించడం, విక్రయించడం, రవాణా చేయడం, వాటికి ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని సూచించారు.

### క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవాలి
### - ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి

కాలేజీ ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల తలెత్తే ఆరోగ్య, సామాజిక సమస్యలతో పాటు కుటుంబ, వ్యక్తిగత జీవితాలపై పడే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

### 'యువతా మేలుకో... మత్తు నుంచి తేరుకో'

ఈగల్ టీమ్ గురుశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో "యువతా మేలుకో--మత్తు నుంచి తేరుకో", "డ్రగ్స్ వద్దు--జీవితం ముద్దు", "మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం--భవిష్యత్తును కాపాడుకుందాం" అంటూ నినాదాలు చేయించారు. పోలీస్ కళా--జాగృతి బృందం ప్రదర్శించిన నాటికలు, పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. వినోదంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా సాగిన ప్రదర్శన ద్వారా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో కాలేజీ హెచ్‌ఓడీ కృష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో పాటు కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, కళా-జాగృతి బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






## అనంతపురంలో 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'...!

- విద్యాసంస్థల పరిసరాల్లో విస్తృత తనిఖీలు.. - నిషేధిత వస్తువుల విక్రయంపై పోలీసుల కొరడా- 5 దుకాణాల యజమానులకు జరిమానా.. - చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** విద్యాసంస్థల పరిసరాల్లో అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులు, జిల్లా ఈగల్ సెల్ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్' నిర్వహించారు. నగరంలోని ఝాన్సీ లక్ష్మీభాయ్ హైస్కూల్, చైతన్య టెక్నో స్కూల్, నారాయణ స్కూల్, గుడ్ చిల్డ్రన్స్ హైస్కూల్ తదితర విద్యాసంస్థల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఉన్న ఆరు కిరాణా దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నట్లు గుర్తించిన ఐదు దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. విద్యాసంస్థల పరిసరాల్లో చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడినా, నిషేధిత వస్తువులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు జిల్లా ఈగల్ సెల్ ఎస్సై హనుమంతు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం పాల్గొంది.

## కంబదూరులో 4,974 మంది విద్యార్థులకు బాలల బీమా ప్రీమియం...!

- రూ.24,870 చెల్లించిన వార్త విలేకరి బి.మల్లేసు
- ఇదే స్ఫూర్తితో మరింత మంది దాతలు ముందుకు రావాలి.
- మల్లేసు దాతృత్వాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** కంబదూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 4,974 మంది విద్యార్థులకు బాలల బీమా ప్రీమియం కింద ఒక్కొక్కరికి రూ.5 చొప్పున మొత్తం రూ.24,870లను వార్త విలేకరి బి. మల్లేసు మంగళవారం జమ చేశారు. బాలల బీమా అకౌంట్‌లో జమ చేసిన మొత్తానికి సంబంధించిన రసీదును జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ. ఆనంద్ విలేకరి బి. మల్లేసును అభినందించారు. మల్లేసు స్వగ్రామం కంబదూరు మండలం వైసిపల్లి కావడంతో, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తన సొంత ఖర్చుతో బీమా ప్రీమియం చెల్లించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేశారు. బాలల బీమా ద్వారా ప్రమాదవశాత్తు విద్యార్థి మృతి చెందితే రూ.25 వేల పరిహారం, గాయపడిన వారికి రూ.10 వేల వరకు సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. బీమా పథకంపై విద్యాశాఖ అధికారులు మరింత అవగాహన కల్పించాలని సూచించారు.

**బీమా పరిధిని విస్తరించాలని వినతి**

బాలల బీమాను సాధారణ మరణాలకు కూడా వర్తింపజేయడంతో పాటు, ప్రీమియంను రూ.5 నుంచి రూ.10కు పెంచి, బీమా మొత్తాన్ని రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని విలేకరి బి. మల్లేసు జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎన్. అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, ఇన్‌చార్జ్ ఐఈడీ కోఆర్డినేటర్ ఫణిరాజు, కంబదూరు ఎంఈఓ-1 ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## వరుణ దేవుడా కరుణించవా అంటూ.. వర్షం కోసం ప్రత్యేక పూజలు



**పామిడి - సూర్య వాస్తవం:** స్థానిక పామిడి మండలపరిధిలో కత్రిమల గ్రామంలో వర్షాలు లేక రైతుల పంట పొలాలకు, మూగజీవాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఉన్నందున కత్రిమల గ్రామంలో ఉన్నటువంటి గొర్రెలకాపరులు రైతులు కలిసి మంగళవారం వేకుమజామున 5 గంటల నుండి గ్రామా ఆరాధ్య దైవంగా భావించే బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి 101 నిండునీళ్ల బిందెలు పోసి బొడ్రాయికి అభిషేకం చేశారు. అనంతరం గొర్రెలకాపరులు రైతులు మాట్లాడుతూ వర్షాలు రాకపోవడం వలన మూగజీవాలకు నీళ్లు లేక విలవిలాడుతున్నాయని, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాలాడుతున్న మూగజీవాలను చూసి గుండె తరుక్కుపోతా ఉందని, గొర్రెల కాపరులు కంటితడి పెట్టుకున్నారు. ఇక రైతులు వర్షం రానందుకు పండ్ల తోటలు, పంట పొలాలు ఎండిపోతున్నందున రైతుల బాధలు వర్ణనా తీతం,రైతుకు నష్టం జరిగిందంటే దేశం నష్టపోతుంది. రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందేనని, ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించి వర్షాలు రావాలని, గ్రామంలో ఉండే దేవాలయాల లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట రాముడు, రంజిత్, సుబ్బరాయుడు, గ్రామపెద్దలు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# మై భారత్ జిల్లా అధికారి ఎక్కడ..?

- నిధులు ఎవరి చేతుల్లో..?
- మై భారత్ కేంద్రంలో అవకతవకల ఆరోపణలు..!
- ఆర్టీఐ ద్వారా పూర్తి వివరాలు కోరిన అనంతపురం అనిల్‌కుమార్
- కార్యాలయానికి వెళితే అధికారులు కనిపించలేదని ఆరోపణ
- నిధుల నిర్వహణపై అనుమానాలు.. సమగ్ర విచారణకు డిమాండ్




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురంలోని మై భారత్ కేంద్రం (నెహ్రూ యువ కేంద్రం) పనితీరు, నిధుల నిర్వహణపై పలు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావాలంటూ అనంతపురానికి చెందిన అనిల్‌కుమార్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు చేసినట్లు తెలిపారు. మై భారత్ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, సిబ్బంది హాజరు, అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా కోరినట్లు అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

**కార్యాలయానికి వెళితే అధికారులు కనిపించలేదని ఆరోపణ**

ఆర్టీఐ దరఖాస్తుకు సంబంధించిన వివరాల కోసం కార్యాలయానికి వెళ్లిన సమయంలో అక్కడ ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేరని ఆయన ఆరోపించారు. అనంతరం ఇన్‌చార్జి జిల్లా యూత్ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా, కార్యాలయంలో ఉన్న క్లర్క్‌కు ఫోన్ ఇచ్చి మాట్లాడాలని సూచించినట్లు తెలిపారు. దీంతో అనంతపురం మై భారత్ కేంద్రానికి జిల్లా స్థాయి అధికారి క్రమం తప్పకుండా వస్తున్నారా..? కార్యాలయ నిర్వహణను ఎవరు పర్యవేక్షిస్తున్నారు..? అధికారి అందుబాటులో లేని సమయంలో పరిపాలనా బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారు..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

**నిధుల నిర్వహణపై అనుమానాలు**

మై భారత్ కేంద్రానికి సంబంధించిన నిధుల నిర్వహణ కొంతమంది వ్యక్తుల చేతుల్లోనే, ముఖ్యంగా ఒక అకౌంటెంట్ ఆధీనంలో జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల పాటింపు అత్యంత కీలకమని, ప్రతి రూపాయి ఖర్చుకు లెక్కలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.

అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత..? నిధులు ఏ విధంగా మంజూరయ్యాయి..? ఏ కార్యక్రమాలకు ఎంత ఖర్చు చేశారు..? బిల్లులు, వోచర్లు సక్రమంగా ఉన్నాయా..? నిధుల వినియోగానికి సంబంధించి ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉంది..? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

**జిల్లా అధికారి ఎన్ని నెలలుగా అందుబాటులో లేరు..?**

అనంతపురం మై భారత్ కేంద్రానికి సంబంధిత జిల్లా అధికారి చివరిసారిగా ఎప్పుడు వచ్చారు..? ఎన్ని రోజులుగా లేదా నెలలుగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు..? అధికారి గైర్హాజరైతే ప్రత్యామ్నాయంగా ఎవరికీ బాధ్యతలు అప్పగించారు..? అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా..? అన్న విషయాలను అధికారులు స్పష్టం చేయాలని అనిల్‌కుమార్ కోరారు. ప్రభుత్వ సంస్థల్లో అధికారులు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాల్సిందేనని ఆయన అన్నారు.

**ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలి**

మై భారత్ కేంద్రంపై వస్తున్న ఆరోపణలన్నింటిపైనా జిల్లా స్థాయిలో కాకుండా ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్యాలయ హాజరు రికార్డులు, నిధుల కేటాయింపులు, బ్యాంకు లావాదేవీలు, బిల్లులు, వోచర్లు, కార్యక్రమాల నిర్వహణ, సిబ్బంది బాధ్యతలు తదితర అంశాలను పరిశీలించాలని కోరారు. ఆరోపణల్లో వాస్తవం లేదంటే అధికారికంగా వివరాలు వెల్లడించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, వాస్తవంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మై భారత్ కేంద్రం వ్యవహారాలపై పారదర్శకంగా సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన కోరారు.

# రైతుకు 9 గంటల... కరెంటు ఎక్కడ...?

- రాప్తాడు నియోజకవర్గంలో 3 గంటలకే పరిమితమైన విద్యుత్ సరఫరా
- కరెంటు కోతలతో పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది?
- కనీసం 7 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి : ప్రభుత్వాన్ని నిలదీసిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



**అనంతపురం - సూర్య వాస్తవం :** వ్యవసాయ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు విద్యుత్ సరఫరా చేయడం లేదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. రాప్తాడు మండలం హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు.

**9 గంటలకు బదులు 3 గంటలే.. పంటలు ఎలా కాపాడాలి?**

రైతులకు వ్యవసాయ అవసరాల కోసం 9 గంటల విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా, రాప్తాడు నియోజకవర్గంలో ప్రస్తుతం 3 గంటలకు మించి విద్యుత్ ఇవ్వడం లేదని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ఇంత తక్కువ సమయంలో రైతులు పంటలకు అవసరమైన నీటిని ఎలా అందించగలరని ప్రశ్నించారు. కనీసం 7 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా ఏదీ?**

విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా సరఫరాను పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణకు తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల ఉత్పత్తి తగ్గుతోందని విమర్శించారు.

**వేలాది ఎకరాల్లో పంటలు.. కోతలతో రైతుల ఆందోళన**

ఇప్పటికే నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారని, విద్యుత్ కోతలు ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రకాష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రాజకీయాలతో కాలయాపన చేస్తోందని విమర్శించారు.

**రైతు భరోసా బకాయిలు చెల్లించాలి**

రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటాగా రావాల్సిన రూ.14 వేల సాయం కూడా రైతులకు పూర్తిగా అందలేదని, ప్రస్తుత ఏడాదికి సంబంధించి కూడా సుమారు రూ.9 వేల వరకు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి విద్యుత్ సరఫరాతోనే స్పష్టమవుతోందని ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను తక్షణమే పెంచి, వ్యవసాయానికి కనీసం 7 గంటల నిరంతర విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కూడేరు చెరువులకు... హంద్రీ-నీవా నీరు ఎప్పుడు..!

- ఎండిపోతున్న పండ్ల తోటలు.. ఆందోళనలో రైతులు
- వర్షాభావంతో విలవిలలాడుతున్న కూడేరు రైతాంగం
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైతే తీవ్ర పరిణామాలు తప్పవు
- కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన వై.విశ్వేశ్వర్‌రెడ్డి

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం:** వర్షాభావంతో అల్లాడుతున్న కూడేరు మండలంలోని రైతులను ఆదు కునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వై. విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా నీటిని చెరువులకు విడుదల చేసి భూగర్భ జలాలను పెంచాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా సాధారణంగానే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతమని, అందులోనూ కూడేరు మండలంలో వర్షపాతం మరింత తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు రైతుల కష్టాలను మరింత పెంచాయని తెలిపారు. సెప్టెంబర్ నెల వచ్చినప్పటికీ సరైన వర్షాలు లేకపోవడంతో మెట్ట పంటలు దెబ్బతినడంతో పాటు బోర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**కన్నబిడ్డలా పెంచుకున్న తోటలు.. కళ్ల ముందే ఎండిపోతున్నాయంటూ రైతుల ఆవేదన**



కూడేరు మండలం హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నప్పటికీ నీటి కొరత రైతులకు శాపంగా మారిందన్నారు. బోర్లలో నీరు లేకపోవడంతో పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఒక్కో ట్యాంకర్‌కు సుమారు రూ.600 ఖర్చు అవుతుండగా, పంట చేతికొచ్చే వరకు ఈ భారాన్ని భరించడం రైతులకు సాధ్యం కాదన్నారు.

**చెరువులు నింపితేనే భూగర్భ జలాలకు ఊపిరి**

ముద్దలాపురం, కరుట్లపల్లి, ఇప్పేరు, అరవకూరు చెరువులతో పాటు బెలుగుప్ప మండలంలోని సీర్పి చెరువుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు పండ్ల తోటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**నీటి వనరుల వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి**

శ్రీశైలం, తుంగభద్ర జలాల లభ్యత, సాగునీటి కేటాయింపులను దృష్టిలో ఉంచుకుని అనంతపురం జిల్లాకు రావాల్సిన నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ వర్షాభావ ప్రాంతాలైన కూడేరు వంటి మండలాలకు తగిన నీరు అందకపోవడం బాధాకరమన్నారు.

**"పంట ఎండిపోతే రైతు తప్పు కాదు.. నీరు అందించలేని ప్రభుత్వ వైఫల్యం"**

రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత నష్టపరిహారం కోసం ఎదురుచూడటం కంటే ముందుగానే నీటి సమస్యను పరిష్కరించాలని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజలు, పశువుల తాగునీటి సమస్య కూడా తీవ్రంగా మారుతున్నందున ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

## ప్రభుత్వప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా సన్మానం



**తనకల్లు – సూర్య వాస్తవం :** మండల కేంద్రంలోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు మంచి విద్యను అందిస్తు తొటి ఉపాధ్యాయులతో కలిసి మెలసి అందరితోను మంచి మన్ననలు పొంది తన విధుల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమ శిక్షణతొ అంకిత భావంతో పని చేస్తూ ప్రభుత్వం మరియు ప్రభుత్వ అధికారులచె గుర్తింపు పొంది ఇటీవల ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులు గా ఎంపికై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆర్జెడి శ్యాముల్ జిల్లా విద్యాశాఖధికారి కిష్టయ్య. ఎంఎల్ సి రాంగోపాల్ రెడ్డి. చేతుల మీదుగా అవార్డు అందుకొని ప్రశంస పత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా తన మిత్రులు నంబులపూలకుంట ఎంఈఓ గోపాల్ నాయక్ మరియు ఏషియన్ బాబు అధ్వర్యంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ తిరుపాల్ నాయక్ శ్రీ రిజ్వాన్ ఖాన్, శ్రీ అబ్దుల్ రహీం. ఉపాధ్యాయులు హానీఫ్, చంద్రయుడు. వెంకట రమణ లు పి మహబూబ్ షరీఫ్ ఉత్తమ ప్రధానోపాధ్యాయ ఎంపిక పట్ల అతను తీసుకున్న అవార్డు పట్ల హర్షం వ్యక్తం చేస్తు భవిష్యత్తు లో రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపి కేక్ కట్ చేసి దుశ్శాలవ గజమాలతొ సన్మానించారు.

## పామిడి పెన్నా నదిలో ఇసుకను అక్రమరవాణ

**- ఇసుక లారీలని అడ్డుకున్న గ్రామస్తులు**







**పామిడి – సూర్య వాస్తవం:** స్థానిక మండల పరిధిలోని వంకరాజుకాల్వ సమీపానగల పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లోడుతో వెళుతున్న టిప్పర్లని గ్రామప్రజలు ఉక్కుమ్మడిగా వందలాది మంది పైగా గ్రామస్తులు కలసి టిప్పర్లని ఆపేశారు.కానీ కొందరు ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారని,రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, ట్రిప్పర్లు ఇతర వాహనాల ద్వారా ఇసుక తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నదిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టాలని అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాల వల్ల నది స్వరూపమే మారిందని, భూగర్భ జలాలు ఇంకిపోయావని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెన్నానది సంపదను కాపాడేందుకు అధికారులు వెంటనే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేయాలని వంకరాజుకాల్వ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆగ్రామం ప్రజలు కోరుతున్నారు.

## బిఎల్ఓలకు-సచివాలయ సిబ్బందికి శిక్షణ



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి సాధారణ మున్సిపల్ ఎన్నిక లు-2026లో భాగంగా మున్సిపాలిటి పరిధిలో గల 32 వార్డులలో ఎస్.సి, ఎస్.టి, బి.సి ఓటర్లు గుర్తించు ప్రక్రియ మీద ఈరోజు మున్సిపల్ ఆఫీసులలో అందరూ బిఎల్ఓలకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదని మున్సిపల్ కమీషనర్ యన్. సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎలక్షన్ డేటా సిబ్బందికి అదేశాలు గా శిక్షణ కార్యక్రమం అనంతరం డే టాను త్వరితగతిన పూర్తీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, టి.పి.బి.ఓ అ ప్పస్వామి, ఎలక్షన్ క్లర్క్ శంకర్, మున్సిపల్ సిబ్బంది, బి.యల్.ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి

**- తహశీల్దార్ పుణ్యవతి**



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం ఎమ్మార్వో కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవాలని గుత్తి తహశీల్దార్ పుణ్యవతి అన్నారు. గుత్తి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల తో సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల వద్ద అగ్ని ప్రమాదం, అల్లర్లు వంటివి జరగ కుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యు లపై ఉంటుందన్నారు. పండుగను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.

# ప్రజాసేవే లక్ష్యం.. అభివృద్ధే అజెండా...!

**- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్నఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు కార్యక్రమం లో అనంతపురం ఎమ్మె ల్యే దగ్గుపాటి ప్రసాద్ సహచర ప్రజ ప్రతినిధులతో కలిసి పాల్గొ న్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసేవ, సుపరిపాలన, పార్టీ--ప్రభుత్వ సమ న్వయం, రాజకీయ కమ్యూనికేషన్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని నియోజకవర్గ స్థాయి అభివృద్ధితో అనుసంధానం చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. నీటి వనరుల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శ కంగా అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించడంతో పాటు రాజకీయ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.అలాగే ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడం, ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపైనా కాంక్లేవ్‌లో చర్చించినట్లు తెలిపారు.



**నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అందించిన దిశానిర్దేశం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు మరింత చురుగ్గా పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# 54 మంది సివిల్ కానిస్టేబుళ్లకు... హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి...!

**- పదోన్నతి పొందిన సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ అభినందనలు**

**- బాధ్యతతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న 2007, 2009 బ్యాచ్‌లకు చెందిన 54 మంది సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి కల్పించినందుకు జిల్లా ఎస్పీ పి. జగదీష్, అదనపు ఎస్పీ ఎం. నాగభూషణంకు పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బంది జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ.. కానిస్టేబుళ్లుగా పనిచేసిన సమయంలో బందోబస్తు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, కోర్టు డ్యూటీలు, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది కీలకంగా పనిచేశారని అభినందించారు. హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన నేపథ్యంలో ఇకపై కేసుల నమోదు, దర్యాప్తు తదితర అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. పదోన్నతితో బాధ్యతలు మరింత పెరిగాయని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సూరి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పదోన్నతులు కల్పించిన జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీతో పాటు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు కార్యక్రమానికి హాజరై పదోన్నతి పొందిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం బేతాపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బెంగ ళూరు నుంచి వచ్చిన జి రామచంద్ర రా వు,డిప్యూటీ డైరెక్టర్(సిబి హెచ్ ఐ) డాక్టర్ విష్ణుమూర్తి ఆర్ బిఎస్ కే.ఎస్ మహమ్మద్ రఫీ, ఎస్ఓఈ బృందం చేత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ప్రజలకు సేవలు అం దించిన రికార్డులను ముఖ్యంగా ఓపి సేవల రిజిస్టర్లు, ఆసుపత్రిలోనే రోగుల రిజిస్టర్లు, ల్యాబ్ సేవలు అందించే, డయాలసిస్, డయా బెటిస్, గళ్ళ పరీక్ష రిజిస్టర్లు, టీబి. రిజిస్టర్లు, బ్లడ్ కల్చర్ రిజిస్టర్లు, యూరిక్ యాసిడ్ యూరిప్రోటీన్ రిజిస్టర్లు, హెచ్ ఎంఐఎస్, కమ్యూనికబుల్ డి సీజెస్,నాన్ కమ్యూనికువల్ డిసీజెస్, రిజిస్టర్లు, స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్ సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించారు. ఈ రికార్డులు యందు అందించిన సేవలను నాణ్యత, గుణాత్మక మైనటువంటి సేవలను అందించిన వివరాలను డిజిటలైజేషన్ అప్లికేషన్ లో నమోదు కాబడిన పరిశీలించారు. నిర్ణయాత్మకమైన సూచనలు తగిన సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్, డాక్టర్ దేవేంద్ర నాయక్ పాల్గొన్నారు.

## యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**పామిడి– సూర్య వాస్తవం:** పామిడి మండల యాదవ సంఘం నూతన కమిటీని మంగళవారం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలంలోని యాదవ కుటుంబాల సంక్షేమం, సంఘం అభివృద్ధి, ఐక్యతే లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా గుగ్గిల్ల మల్లికార్జున యాదవ్, గౌరవ అధ్యక్షులుగా రంగస్వామి యాదవ్, గంగాచంద్ర యాదవ్, శ్రీరాములు యాదవ్, వి. పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఓబుళక్రిష్ట యాదవ్, రామాంజినేయులు యాదవ్, ఈశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా నాగశివ యాదవ్, కోశాధికారిగా ఓబిరెడ్డి యాదవ్, కార్యదర్శులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యుల ఎన్నిక అనంతరం యాదవ కుటుంబ సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మండల యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సంఘం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, యాదవ కుటుంబాల ఐక్యత కోసం కృషి చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న యాదవ కుటుంబాల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా కుటుంబాల్లో ఎవరైనా కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పుడు వారికి అండగా నిలిచి, అవసరమైన సహాయాన్ని అందించేందుకు సంఘం తరపున ముందుంటామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికతో మండలంలోని యాదవ కుటుంబాల్లో నూతన ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు యాదవ్, రామాజినేయులు యాదవ్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## టిప్పర్‌ను ఢీకొన్న మినీ లారీ

**- మినీ లారీ డ్రైవర్ మృతి**



**దొరవారిసత్రం-సూర్య వాస్తవం:** దొరవారిసత్రం మండల పరిధిలోని నెమలి మిట్ట అగ్రహారం గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారి పై వెదురుపట్టు క్రాస్ రోడ్ వద్ద సోమవారం అర్ధరాత్రి సమీపంలో టిప్పర్ లారీని..ఓమిని లారీ ఢీ కొనడంతోమినీ లారీలో ఉన్న డ్రైవర్ శరవన్ మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం వెదురుపట్టు వద్ద క్రాస్ రోడ్ లో రాత్రి సోమవారం అర్ధరాత్రి సమయంలో వెదురు పట్టుకు వెళుతున్న టిప్పర్ లారీ క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరగడంతో నెల్లూరు వైపు నుండి చెన్నైకి వెళుతున్న మినీ లారీ టిప్పర్ వెనుక భాగమున ఢీకొన్నది, దింతో మినీలారీలో ఉన్న డ్రైవర్ శరవన్ కోన ఊపిరితో ఉండడంతోపాటు మినీ లారీ లోని లోపల ఇరుక్కునిపోయిన సంఘటన చోటు చేసుకుంది..యాక్సిడెంట్ జరిగిన సంఘటన ప్రాంతాల్లో కొంతమంది లారీ డ్రైవర్లు సహాయంతో అద్దాలు పగలగొట్టి కోన ఊపిరితో ఉన్న లారీ డ్రైవర్ వ్యక్తిని కిందకు తీసుకురావడం జరిగింది.. అనంతరం సమాచారం అందుకున్న దొరవారిసత్రం పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడు డ్రైవర్ను నేషనల్ హైవే అంబులెన్స్ మొబైల్లో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అప్పటికే మృతి చెందాడు.అనంతరం యాక్సిడెంట్ జరిగిన ప్రాంతంలో గంటసేపు పాటు ట్రాఫిక్ జామ్ నిలిచిపోయింది.పోలీసులు లైన్ క్లియర్ చేయడంతో ఎక్కడ వాహనాలు అక్కడికి వెళ్లిపోవడం జరిగింది. ఈ కేసును నమోదు చేసి దర్యాప్తునట్లుగా పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఋతుస్రావ పరిశుభ్రతపై అవగాహన

**- బాలికలకు శానిటరీ ప్యాడ్ల పంపిణీ**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలకు ఋతు స్రావ పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కలిగించారుఈ సందర్భంగా తడ మండలం మాంబట్టు సెజ్‌లోని టాటా కెమికల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా టాటా కెమికల్స్ సంస్థ నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులు బాలికలకు ఋతుస్రావ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన పద్ధతులు,శానిటరీ ప్యాడ్లను సరైన విధంగా ఉపయోగించడం, వినియోగించిన ప్యాడ్లను పరిశుభ్రంగా పారవేయడం వంటి అంశాలపై అవగాహన కల్పిం చారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాల్సిన అవసరాన్ని వివరిం చారు. కార్యక్రమంలో భాగంగా అవసరమైన బాలికలకు శానిటరీ ప్యాడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఋతుస్రావంపై ఉన్న అపోహలు,సంకోచాలను తొలగించి బాలికలు తమ ఆరోగ్యం గురించి స్వేచ్ఛగా మాట్లాడేలా ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు బాలికల్లో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఋతుస్రావ పద్ధతులను అలవర్చుకోవడానికి దోహదపడతా యని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. మహిళలు, బాలికల ఆరోగ్యం, విద్య, ఆత్మవిశ్వాసం,సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## నాగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతాపం





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** నాయుడుపేట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య మంగళవారం జువ్వలపాలెంలోని వారి నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా నాగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కుమారుడు నాగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ని ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి తంబి రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,నాయుడుపేట మండల ప్రెసిడెంట్ కలికి మాధవరెడ్డి, జిల్లా సెక్రటరీ మద్దాలి సోమశేఖర్ రెడ్డి,దొరవారిసత్రం సీనియర్ నాయకులు వేణుంబాక మునిస్వామి నాయుడు,ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హర్నాథ్ రెడ్డి,ఎంపీపీ ధనమ్మ,రాష్ట్ర కళాకారుల సెక్రటరీ కటకం జయరామయ్య, దొరవారిసత్రం మండల అధ్యక్షులు రాహుల్ రెడ్డి కన్మని,మాజీ కౌన్సిలర్లు దువ్వూరు నారాయణరెడ్డి అశోక్,అనిల్ రెడ్డి,వంశీ,తదితర నాయకులు పాల్గొని నాగిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కి నివాళులర్పించారు.

# యువత భవిష్యత్తుకు భరోసా..

## - ఉద్యోగ అవకాశాలకు ధర్మవరం వేదిక..

## మెగా జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ధర్మవరం గడ్డపై మరోసారి యువత కోసం బృహత్తర అడుగు పడింది.ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, మా సంస్కృతి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఘనంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 2,000 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన స్ఫూర్తితో..మరోసారి 100కు పైగా ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి 3,000 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాల తలుపులు తెరిచారు. ఇది కేవలం జాబ్ మేళా కాదు..వేలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే కార్యక్రమం అన్ని మంత్రి అన్నారు.యువతకు ఉద్యోగం కావాలి.వారి ప్రతిభకు సరైన వేదిక కావాలి..వారి



కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం రావాలి..ఈ లక్ష్యంతో ముందుకు సాగుతున్న ధర్మవరం యువతకు సరికొత్త ఆశలు కల్పిస్తోందన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం..యువతకు అండగా నిలవడం.. ఉపాధి అవకాశాలను వారి గడపకు తీసుకురావడం..ఇదే సత్యకుమార్ యాదవ్ ప్రజా సేవా పంథా.అని ధర్మవరం యూత్ అభినందనలు తెలియజేశారు ఉద్యోగాలు సాధించిన ప్రతి యువతీ యువకుడికీ హృదయపూర్వక అభినందనలు.మీ విజయమే ధర్మవరం అభివృద్ధికి నిజమైన బలం అన్నారు.

**యువతకు ఉద్యోగం -- కుటుంబాలకు భరోసా -- ధర్మవరానికి అభివృద్ధి!**

సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో యువత భవిష్యత్తుకు బలమైన బాట!అని ధర్మవరం ప్రజలు యువతి యువకులు ఉద్యోగాలు పొందిన యువకులు మంత్రి సత్య కుమార్ యాదవ్ కు అభినందనలు తెలియజేశారు.



# మట్టి గణపతులను పూజిద్దాం...

**- పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదాం...**

**- కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపు**





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి నగర ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ఇతోదికంగా భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందిరా మైదానం లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మంటపాల అనుమతుల మంజూరు హెల్ప్ లైన్ సెంటర్‌ను మంగళవారం కమిషనర్ సందర్శించారు. వినాయక చవితికి మంటపాల అనుమతుల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలుపారు. నగరంలో వినాయక చవితి వేడుకలు భక్తిబావంతో జరుపుకునేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.చవితి వేడుకలు నిర్వహించే వారు మంటపాల ఏర్పాటుకు అన్ని విభాగాల అధికారుల కార్యాల యాలకు వెళ్లకుండా ఒకే చోట అన్ని అనుమతులు ఇచ్చేలా ఈ సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్వాహకులు అందరూ ఇక్కడ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు.నగరంలో చవితి వేడుకల నిర్వహణపై ఇప్పటికే పలు సూచనలు, నిబంధనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అందరూ వాటిని తప్పకుండా పాటించాలని, భక్తి భావంతో ఆనందంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవ కమిటీ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఉత్సవ కమిటి కన్వినర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్, మాంగాటి గోపాల్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు నూతన సేవా పథకం వర్తింపజేయండి

**-ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు.**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ధర్మవరం పట్టణంలోని చేనేత కార్మికులకు చాలామందికి నేతన్న నేస్తం పథకం రాలేదని, రానివారికి వెంటనే వర్తింప చేసేలా చర్యలు గైకొనాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆరోగ్యశాఖ మంత్రి సతీష్ కుమార్ యాదవ్ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ ప్రాంతంలో,జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తించలేదని కూటమి ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం ద్వారా వారి కుటుంబాలలో మంచి జరగాలని పథకం అమలు చేసినప్పటికీ కొంతమంది నిర్వాహకం వలన అర్హులైన చేనేత కార్మికులకు అన్యాయం జరిగినదని ప్రభుత్వం గుర్తించి అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం జరిగాలనే ఉద్దేశంతో రెండో విడతలో దాదాపుగా 33,600 చేనేత కార్మికులను గుర్తించి వారికి పథకం ఆగస్టు 30 తారీఖున అమలు చేస్తామని జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరిగి సెప్టెంబర్ 10వ తారీఖు లోపు అందరికి వర్తింప చేసే విధంగా చర్యలు చేపడతామని తెలపడం జరిగినదని, ముఖ్యంగా అర్హులైన చేనేత కార్మికులకు సెప్టెంబర్ 10 లోపు అమలు అయ్యేటట్లు మంత్రిగా చొరవ చూపాలని, ధర్మవరం ప్రాంతంలో వినాయక చవితి పండుగ చాలా ఘనంగా చేనేత కార్మికులు జరుపుకుంటారని, కనీసం ఆ పండుగ సందర్భంగా అయినా అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తింపచేయాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ లోపు అర్హులైన ప్రతి చేనేత కార్మికుని కి నేతన్న సేవా పథకం వర్తించే విధంగా జౌళి శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ తో ఫోన్ ద్వారా మాట్లాడి హామీ ఇవ్వడం జరిగినది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత జిల్లా కన్వీనర్ జె.వి.రమణ చేనేత జిల్లా నాయకులు ఎస్ హెచ్ భాష, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ ఖాదర్ భాషా, గుంపు హరి,చేనేత నాయకులు వి. వెంకటస్వామి,లోకేష్,తిమ్మరాజు,బండి రామకృష్ణ, బొమ్మ శివప్రసాద్,అన్నం సూరి,సుధాకర్,గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 7 రోజుల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా

**తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు.**

**- మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తిపై నాయుడుపేట పోలీసులు కేసు నమోదు.**

**- కోర్టులో హాజరుపరచగా 7 రోజుల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా.**

**- మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక.**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా నాయుడుపేట పోలీసులు నిర్వహించిన తనిఖీలలో మద్యం సేవించి ఆటో నడుపుతున్న సూళ్లూరుపేటకు చెందిన ఈ.సందీప్ కుమార్ (25),తండ్రి ఆల్లయ్యను గుర్తించి, అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

ఈ ఘటన 01-09-2026 రాత్రి చోటుచేసుకుంది.కేసు దర్యాప్తు అనంతరం నిందితుడిని ఈ రోజు(08-09-2026) నాయుడుపేట జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరచగా, గౌరవ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పి. మీనాక్షి సుందరి గారు కేసును విచారించి, నిందితుడికి 7 రోజుల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడితో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి.డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.వాహనం నడిపే ముందు మద్యం సేవించకుండా ఉండటం ప్రతి వాహనదారుడి బాధ్యత. మీ భద్రతతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలి అని సూచించారు.తిరుపతి జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని,మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కోర్టు ద్వారా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# 'పార్ట్ టైమర్స్' (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పైకి థ్రిల్లర్ నేపథ్యంలోని కథలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడపాదడపా మాత్రం యూత్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందే సిరీస్ లు ఓటీటీ ట్రాక్ పై ప్రత్యక్షమవుతున్నాయి. అలా నిర్మితమైన సిరీస్ గా 'పార్ట్ టైమర్స్' కనిపిస్తుంది. తనూజ - జ్ఞానేశ్వరి కాండ్రేగుల ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ నుంచి, 8 ఎపిసోడ్స్ అందుబాటులో వచ్చాయి. సంపత్ కుమార్ తోట దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం.తేజు (జ్ఞానేశ్వరి) శ్రీమంతుల కుటుంబానికి చెందిన అమ్మాయి. ఆమె తండ్రికి చాలా బిజినెస్ లు ఉంటాయి. కానీ తన కాళ్లపై తాను నిలబడాలనే ఉద్దేశంతో .. తనకి నచ్చినట్టుగా స్వేచ్ఛగా ఉండాలనే ఆలోచనతో ఆమె ఒక ఫ్లాట్ లో రెంట్ కి ఉంటుంది. క్యాబ్ నడుపుతూ తనకి ఖర్చులకి తగిన డబ్బును సంపాదించుకుంటూ ఉంటుంది. ఆవేశం .. లెక్కలేనితనం ఎక్కువ. అందువలన ఆ కమ్యూనిటీలో ఎవరికి కూడా ఆమె అంటే పడదు. అలాంటి తేజుతో ఫ్లాట్ షేర్ చేసుకోవడానికి సింధు (తనూజ) వస్తుంది. సింధు తండ్రి లేని అమ్మాయి. తల్లితో కలిసి బాబాయ్ ఇంట్లో ఉంటూ ఉంటుంది. క్రమశిక్షణ పేరుతో బాబాయ్ ఆమెను ఇబ్బందిపెడుతూ ఉంటాడు. అంతేకాదు బంధువైన నవీన్ తో ఆమె పెళ్లి జరిపించడానికి ప్రయత్నాలు చేస్తుంటాడు. అది ఇష్టం లేని సింధు, ఆఫీసుకు దగ్గరగా ఉంటుందనే ఉద్దేశంతో రెంట్ కి దిగుతుంది. అయితే గతంలో సింధుతో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న తేజు, ఆమెతో కోపంగా ఉంటుంది. ప్రతి చిన్న విషయానికి సీరియస్ అవుతూ ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

సింధుని తేజు ఇబ్బంది పెడుతుందని గ్రహించిన కమ్యూనిటీ వాళ్లు, సింధును సపోర్ట్ చేయడం మొదలుపెడతారు. అదంతా సింధు చేయిస్తోందనే ఉద్దేశంతో ఆమెపై తేజు మరింత కోపాన్ని పెంచు కుంటుంది. కెరియర్ పరంగా ఇద్దరూ ఇబ్బందులలోనే ఉంటారు. ఆ పరిస్థితి నుంచి బయటపడటం కోసం వాళ్లు ఏం చేస్తారు? ఆ ప్రయత్నాలు ఫలిస్తాయా? వాళ్ల జీవితాలలో కొత్తగా చోటుచేసుకునే మలుపులు ఎలాంటివి? అనేది మిగతా కథ.కలవారి కూతురైన తేజు పంతానికిపోయి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయి స్వేచ్ఛగా బ్రతుకుంటూ ఉంటుంది. సమస్యలను .. సవాళ్లను ఎదుర్కోవడానికి ఆమె సిద్ధంగా ఉంటుంది. ఇక పేదింటి అమ్మాయి అయిన సింధు,




తనకి ఇష్టం లేని పెళ్లి సంబంధం నుంచి తప్పించుకోవడం కోసం బయటికి వస్తుంది. జీవితంలో తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఇద్దరికీ ఉంటుంది. భిన్నమైన స్వభావాలను కలిగిన ఇద్దరు అమ్మాయిల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఒక వైపున తేజు ఆమె ఫ్రెండ్ సర్కిల్. మరో వైపున సింధు ఫ్రెండ్స్ .. అపార్టుమెంటులో కమ్యూనిటీ వాళ్ల గొడవలు. ఇలా ఈ మూడు వైపుల నుంచి వినోదాన్ని రాబట్టడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక క్రమశిక్షణ పేరుతో బాబాయ్ చేసే హడావిడి .. 'మాకున్నంతలో' అంటూ తేజు తండ్రి మేనరిజంతో కాస్త హాస్యాన్ని పండించడానికి దర్శకుడు గట్టిగానే కష్టపడ్డాడు. అయితే ఈ కామెడీ కాస్తయినా వర్కౌట్ అయిందా అంటే కాలేదనే చెప్పాలి.సింధు పాత్ర వైపు నుంచి చూసుకుంటే, ఆమె ఆఫీస్ కి సంబంధించిన వ్యవహారాలు అంత ఇంట్రెస్టింగ్ గా అనిపించవు. అలాగే కెరియర్ పరంగా తేజుకి ఎదురైన సంఘటనలు కూడా అంత ఎఫెక్టివ్ గా అనిపించవు. ఇద్దరికి సంబంధించిన ట్రాకులు చాలా సాదాసీదాగానే సాగిపోతూ ఉంటాయి. ఈ రెండు పాత్రల చుట్టూ ఉండే మిగతా పాత్రలు కూడా ఎంటర్టైన్ చేయలేకపోయాయి. ప్రధానమైన పాత్రలు .. వారి కుటుంబ నేపథ్యాల చుట్టూనే ఈ కథ తిరుగుతూ వెళుతుంది. ఈ ఎనిమిది ఎపిసోడ్స్ లోని కథను ఫాలో అవుతూ వెళితే బలమైన సన్నివేశాలు పడలేదనే అనిపిస్తుంది. కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ లేకపోగా, నవ్వించడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడం కనిపిస్తుంది. కథ కూడా ఎపిసోడ్ ఎపిసోడ్ కి ప్రభావాన్ని పెంచకపోగా, అక్కడక్కడే తిరుగుతున్నట్టుగా ఉంటుంది. ఇక ముమ్ముందు పుంజుకుంటుందేమో చూడాలి.

ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా బాగానే చేశారు. వివేక్ ఫొటోగ్రఫీ .. భరత్ మంచిరోజు సంగీతం .. తార చంద్రశేఖర్ రెడ్డి ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఇంకా మిగతా ఎపిసోడ్స్ రావలసి ఉంది గనుక, ఆ ఎపిసోడ్స్ లో కథ ఎలాంటి మలుపులు తీసుకుంటుందనేది తెలియాలంటే వెయిట్ చేయాలి.



## హిందీ మన జాతీయ భాష అన్న శివరాజ్‌కుమార్ పై కన్నడిగుల ఆగ్రహం

తన పాన్-ఇండియా చిత్రం 'ఒరిజినల్ మాన్‌స్టర్' టైటిల్ లాంచ్ కార్యక్రమంలో కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ హిందీ భాషపై చేసిన వ్యాఖ్యలు కన్నడిగుల్లో అసంతృప్తికి దారితీశాయి. హిందీలో డైలాగులు చెప్పడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... హిందీ చాలా సులువైన భాష అని, అది మన రెండో భాషతో పాటు 'జాతీయ భాష' అని, తనకు హిందీ బాగా వచ్చని పేర్కొన్నారు. ఈ వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడంతో కన్నడిగులు, కన్నడ సంస్కృతీ పరిరక్షకులు ఆయన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారతదేశానికి ఎలాంటి అధికారిక 'జాతీయ భాష' లేదని, అన్ని ప్రాంతీయ భాషలకు సమాన ప్రాధాన్యం ఉందనే స్పృహ లేకుండా కన్నడ నాట దిగ్గజ కుటుంబానికి చెందిన హీరో ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని నెటిజన్లు మండిపడుతున్నారు. దివంగత లెజెండరీ నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ కన్నడ భాషా ఉద్యమాల్లో నిర్వహించిన పాత్రను గుర్తుచేస్తూ, శివరాజ్‌కుమార్ మాటలు వింటే ఆయన ఆత్మ నిరాశ చెందుతుందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. అయితే, దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న భాష అనే భావనతోనే శివరాజ్‌కుమార్ ఆ మాటలు అన్నారని, కన్నడ భాషను కించపరచాలనే ఉద్దేశం ఆయనకు లేదని అభిమానులు సమర్థిస్తున్నారు.ఆర్. చంద్రు దర్శకత్వంలో 1990-2000 కాలం నాటి యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఒరిజినల్ మాన్‌స్టర్' సినిమాతో శివరాజ్‌కుమార్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్న వేళ ఈ వివాదం రాజుకోవడం గమనార్హం. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.



### దులీప్ ట్రోఫీ ఫైనల్: షమీ, ముకేశ్ దెబ్బ..

# పీకల్లోతు కష్టాల్లో సౌత్ జోన్



దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. స్టార్ బౌలర్లు మహమ్మద్ షమీ, ముకేశ్ కుమార్ అద్భుత ప్రదర్శనతో చెలరేగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ పీకల్లోతు కష్టాల్లో పడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇంకా 466 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఈస్ట్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించగా, అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (56లి) అజేయంగా నిలిచి ఒంటరి పోరాటం చేస్తుండగా, దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీతో రాణించాడు. అయినప్పటికీ, కీలక సమయాల్లో బ్యాటర్లు బాధ్యతారాహిత్యంగా వికెట్లు పారేసుకోవడం సౌత్ జోన్‌ను దెబ్బతీసింది.ఈస్ట్ జోన్ బౌలర్లు పాత బంతితోనూ అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా రివర్స్ స్వింగ్‌తో సౌత్ జోన్ బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. షమీ, ముకేశ్ కుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టి సౌత్ జోన్ పతనానికి కారకులయ్యారు. రికీ భుయ్, స్మరణ్ రవిచంద్రన్ వికెట్ల విషయంలో డీఆర్ఎస్ ఈస్ట్ జోన్‌కు అనుకూలంగా వచ్చింది.

నారాయణ్ జగదీశన్, దేవదత్ పడిక్కల్ వంటి కీలక బ్యాటర్లు అనవసర షాట్లకు ప్రయత్నించి పెవిలియన్ చేరారు.మొత్తం మీద, ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీకి తోడు బౌలర్లు కూడా రాణించడంతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. తిలక్ వర్మ క్రీజులో ఉన్నప్పటికీ, సౌత్ జోన్ ఈ మ్యాచ్‌లో ఓటమి నుంచి గట్టెక్కడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది.



## ఆసియా కప్ ట్రోఫీ వద్దు.. భారత్‌ను ఓడించాలన్న పాక్ అభిమాని.. టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన ఓ అభిమాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై భారత క్రికెట్ అభిమానులు తమదైన శైలిలో ధీటుగా బదులిస్తున్నారు.దుబాయ్ వేదికగా హాంగ్‌కాంగ్‌తో జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన పాకిస్థాన్ మహిళల జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం పాక్ జట్టు హెడ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో ఓ అభిమాని మాట్లాడుతూ, "మాకు ఆసియా కప్ ట్రోఫీ అవసరం లేదు, భారత జట్టును ఓడిస్తే చాలు" అని కోరాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు ఘాటుగా స్పందిస్తున్నారు. "వారు క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా పరిగణిస్తారు. కానీ రెండు చోట్లా వారికి ఓటమి తప్పదు" అని ఒకరు వ్యాఖ్యానించగా, "మొన్నటి ఓటమి షాక్ ఇంకా సరిపోలేదా? ఫైనల్‌కు రండి, ఈసారి టీమిండియా అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతుంది" అంటూ మరొక అభిమాని ఎద్దేవా చేశాడు.ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 10న జరగనున్న సెమీస్‌లో బంగ్లాదేశ్ లేదా యూఏఈ విజేతతో భారత్ తలపడనుంది. మరో సెమీ ఫైనల్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచుల్లోనూ భారత్, పాకిస్థాన్ విజయం సాధిస్తే, సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో దాయాదుల మధ్య మరో హై వోల్టేజ్ పోరు ఖాయం కానుంది.

# మహిళా భద్రత సమాజం ప్రాథమిక బాధ్యత

**- సబ్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్**

**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక పోలీస్ కార్యాలయంలో మంగళ వారం నాడు మహిళల సామాజిక భద్రత అంశంపై జిల్లా సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డిఎస్పి రాజేంద్రప్రసాద్ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ మహిళలకు సామాజిక భద్రత అంశాల పైన అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మహిళలభద్రత సామాజిక బాధ్యత అని మహిళలు భద్రతగా ఉంటేనే ఆ సమాజం అభివృద్ధి చెందిందిగా భావిస్తామని రాష్ట్ర ప్రభుత్వం మహిళా భద్రత కోసం అనేక కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు మహిళలకు అవగాహన కలిగిస్తూ నిత్యం వారి భద్రతను పర్యవేక్షించడానికి అనేక రకాల సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచార సాధనాలు చేస్తుందని మహిళా భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో వేయాన్ని వెచ్చించి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మహిళా భద్రతను సంరక్షిస్తున్నారని మహిళలు భద్రత మన సామాజిక బాధ్యత కనుక సమాజంలో విజ్ఞానవంతులైన మనము అక్షరాస్యత లేనటువంటి వారికి అవగాహన కల్పిస్తూ




వారికి భద్రత కల్పించడంలో మీ వంతు కృషి చేయాలని ముఖ్యంగా ఇప్పుడు ఉన్నటువంటి సమాజంలో ప్రతి ఒక్కరికి సెల్ ఫోన్ అందుబాటులో ఉంటుంది కనుక అందులో శక్తి యాప్ ను ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలని ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఆసక్తి యాప్ ద్వారా సంబంధిత వ్యవస్థకు లేదా మా పోలీస్ శాఖ వారికి సమాచారం అందిస్తే వెంటనే దానిలోని లొకేషన్ ఆధారితంగా మా శక్తి టీం చేరుకొని మహిళలకు భద్రత కల్పించి రక్షణగా నిలుస్తుందని అలాగే అత్యవసర పరిస్థితులలో 112 కు ఫోన్ చేస్తే సమాచారం ఇస్తే వెంటనే పోలీస్ శాఖ వారు మీ దగ్గరికి చేరుకొని మీకు రక్షణగా నిలుస్తారని మీ ప్రాంతంలో ఆడపిల్లలకు ఏదైనా నమస్తే తలెత్తినప్పుడు 1098 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే మా పోలీస్ టీం వారు వారికి రక్షణ కల్పిస్తారని 1930 నెంబర్‌కు ఫోన్ చేసి మీకు ఏదైనా సైబర్ నేరాలకు సంబంధించినటువంటి సమస్య తలెత్తినప్పుడు సమాచారం అందిస్తే పరిష్కరించడానికి ముందుకొస్తారని మీ ప్రాంతంలో గృహింస వరకట్నపు వేధింపులు జరిగినప్పుడు 181 నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరించడానికి మా శాఖ వారు చర్యలు చేపడతారని ఆయన తెలిపారు. అలాగే సోషల్ మీడియా పట్ల జాగ్రత్త వహించాలని ముఖ్యంగా విద్యార్థులు మహిళలు సోషల్ మీడియాను నమ్మి మోసపోవద్దని వారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటన్న, చిన్న సుబ్బయ్య, వెంకటరమణయ్య, కడప మహిళా పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగేష్ కుమార్, ఓబులేష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్, మహిళా పోలీసులు నాగసుధ, శ్రీజా, రాణి, నాగలక్ష్మి, శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో
# పతకాల మోత మోగించిన అన్నమయ్య పోలీసులు

**-టెన్నిస్‌లో రన్నరప్‌గా నిలిచి స్ఫూర్తినిచ్చిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**
**-మొత్తం 21 పతకాలు (07 స్వర్ణ, 08 రజత, 06 కాంస్య) కైవసం**
**-విజేతలను అభినందించి, పతకాలతో సత్కరించిన జిల్లా ఎస్పీ**
**- క్రీడలతో ఒత్తిడి దూరం, శారీరక దృఢత్వం: ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**



**రాయచోటి-సూర్య వాస్తవం:** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుండి 4 వరకు జరిగిన '1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026' పోటీల్లో అన్నమయ్య జిల్లా పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కర్నూలు రేంజ్ తరపున ప్రాతినిధ్యం వహించిన అన్నమయ్య జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ సత్తా చాటి మొత్తం 21 పతకాలను కొల్లగొట్టారు. ఈ ఘన విజయం సాధించిన క్రీడాకారుల బృందం మంగళవారం మదనపల్లెలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ని మర్యాదపూర్వకంగా కలిశారు. విజేతలను ఎస్పీ స్వయంగా అభినందించి, పతకాలతో ఘనంగా సత్కరించారు.

అన్నమయ్య జిల్లా సాధించిన పతకాల వివరాలు:

**ఎస్పీ స్ఫూర్తిదాయక విజయం:**

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్వయంగా టెన్నిస్ డబుల్స్ విభాగంలో అద్భుత ఆటతీరును ప్రదర్శించి రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ (రజతం) సాధించి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. "పోలీస్ వృత్తి నిరంతర ఒత్తిడితో కూడుకున్నది. క్రీడల ద్వారా ఆ ఒత్తిడిని సమర్థవంతంగా అధిగ మించవచ్చు. సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలి. క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని అందిస్తాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో 21 పతకాలు సాధించడం అన్నమయ్య జిల్లాకు గర్వకారణం. భవిష్యత్తులో కూడా క్రీడల్లో రాణించే ప్రతిభావంతులను జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రోత్సహిస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పతకాలు సాధించిన పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 2 వ రోజు టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెండో రోజు 'టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్' కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పొలిట్ బ్యూరో సభ్యులు,జోనల్ ఇంచార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి,ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంసమర్థవంతమైన సుపరిపాలన కొనసాగించడం వంటి కీలక అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. అలాగే భవిష్యత్తులో పొంచివున్న ఎల్‌నినో వాతావరణ ప్రభావం,దాని వల్ల ఎదురయ్యే పరిస్థితులపై ముందస్తు అవగాహన పెంచుకోవడంపై కూడా మేధోమథనం సాగింది. వీటితో పాటు త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి నుంచి సన్నద్ధం చేయడం,నాయకులందరూ సమష్టి కార్యాచరణతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఎమ్మెల్యే డా. విజయశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని నేతలకు మార్గనిర్దేశం చేశారు. నాయకత్వ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మరింతగా పెంపొంది ంచుకోవాలని, అప్పుడే ప్రజలకు మరింత చేరువగా పనిచేయ గలుగుతామని సీఎం ఉద్బోధించారు. ప్రభుత్వ పథకాలను సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్తూ ముందుకు సాగాలని ఆయన చేసిన విలువైన దిశానిర్దేశం నాయకుల్లో నూతనోత్తేజాన్ని నింపిందని ఎమ్మెల్యే డా. విజయశ్రీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వినాయక ఉత్సవాలపైముస్లిం మత పెద్దలతో
# సీఐ దేవానంద్ సమావేశం..



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో అర్బన్ సీఐ దేవానంద్ ముస్లిం మత పెద్దలు, ఖాజీలు, జమాత్ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా పట్టణంలో శాంతి భద్రతలు, మత సామరస్యం, సోదరభావం కొనసాగించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ దేవానంద్ కోరారు. వినాయక మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణ, ఊరేగింపులు తదితర అంశాలపై నిబంధనలను మత పెద్దలకు సీఐ వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. అలాగే పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముస్లిం మత పెద్దలు తమవంతు సహకారం అందించాలని సీఐ కోరారు. ఇందుకు మత పెద్దలు కూడా తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దల వివరాలను పోలీసులు తెలుసుకుని, ఉత్సవాల సమయంలో పరస్పర సమన్వయంతో పనిచేసేలా చర్చించారు. రాయదుర్గం పట్టణంలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గం

**-రాహుల్ గాంధీ పై నమోదు చేసిన ఎఫ్ ఐ ఆర్ ను వెంటనే తొలగించాలి**
**-రాయచోటి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అమీర్ భాష డిమాండ్**



**రాయచోటి – సూర్య వాస్తవం:** జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గమని రాయచోటి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అమీర్ భాష అన్నారు. మంగళవారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన మైదానాన్ని కొందరు 'శుద్ధీకరణ' చేయడంపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, వ్యతిరేక ఆలోచన అని విమర్శించారు. అంతమాత్రాన రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఒక సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయనే ఫిర్యాదుతో ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గపు ఆలోచన అన్నారు. ఈ కేసును బిజెపి రాజకీయ కక్షసాధింపు చర్యగా ఆయన అభివర్ణించారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం మాట్లాడిన రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతలు కూడా ఈ ఎఫ్ఐఆర్‌ను ప్రజాస్వామ్య విలువలకు పేర్కొంటూ తీవ్రంగా ఖండిస్తున్న విషయం దేశ ప్రజలందరికీ తెలిసిందే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అమీర్ బాష, పట్టణ అధ్యక్షుడు సర్దార్, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్ ఖాన్, ఖాదర్ ఖాన్, నాగముని రెడ్డి, రియాజ్ లు పాల్గొన్నారు.

## రాయచోటీలో గంజాయి ముఠా అరెస్ట్

**- వారి వద్ద నుంచి ఒకటి పాయింట్ ఐదు కిలోల గంజాయి స్వాధీనం**





**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం :** రాయచోటిలో ఒడిశా నుంచి అక్రమంగా తీసుకువచ్చి విక్రయిస్తున్న 1.5 కిలోల గంజాయిని పట్టుకున్నామని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్,. రాయచోటిలో వివరాలు వెల్లడించారు. ఈ వ్యవహారంలో గంజాయి విక్రయిస్తున్న సయ్యద్ హుజైఫా, కత్తి వినయ్ కుమార్, సయ్యద్ మహమ్మద్ రఫీ అనే ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మీడియా సమావేశంలో ఎస్పీ తో పాటు రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, సీఐ బి.వి.చలపతి, ఎస్ఐ యస్. అబ్దుల్ జహీర్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. యువతను కాపాడేందుకు మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, గంజాయి విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని అధికారులు ప్రజలను కోరారు.

# విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మనోహర్ కుటుంబానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అండ

**- రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం హామీ**
**- వీణ్నూ పోరాట ఫలితంగా ఆనాడు ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**- బాధిత దళిత కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన మాదిగ దళ పోరాట సమితి.**

**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** సంబేపల్లి మండలంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన నాయకుడు మనోహర్ కుటుంబానికి రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అండగా నిలిచారు. జరిగిన ఘటనపై ఆనాడు ఎండి పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ గారి ఆధ్వర్యంలో భారీగా నిరసన కార్యక్రమం తెలిపి జరిగిన ఘటనపై పోరాటం చేయడంతో స్పందించిన మంత్రి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో పాటు లిరూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎండి పిఎస్ మాదిగ దళ పోరాట సమితి పోరాట ఫలితంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఈరోజు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ మంత్రి జనార్దన్ రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో కలిసి అందజేశారు. అతి త్వరలోనే బాధిత కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140

## గుమ్మగట్ట మండలంలో జేసీ సి.విష్ణుచరణ్ విస్తృత పర్యటన..





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** గుమ్మగట్ట మండలంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ విస్తృతంగా పర్యటించారు. మంగళ వారం గుమ్మగట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలో 6వదశ కింద చేపట్టిన రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రీసర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని, గడువులోపు అన్ని పనులను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టును జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బిటి ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలను అధికారులతో జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం గుమ్మగట్ట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పురోగతి, రీసర్వే పనులు, మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం, తదిదర అంశాలపై తహసిల్దార్, అధికారులతో సమీక్ష చేసి వేగవంతంగా దరఖాస్తులను పరిష్కారం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయం పక్కనే గడ్డివాములకు మంటలు

**- బెలుగుప్పలో అగ్నిప్రమాదం.. అప్రమత్తమైన గ్రామస్తులు**

**- రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం**





**బెలుగుప్ప - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెలుగుప్ప మండల కేంద్రంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రైతులకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు, రైతులు ఆందోళనకు గురయ్యారు.రైతు దొడ్లో శివకు చెందిన పశుగ్రాసంతో పాటు ఇంటి నిర్మాణానికి ఉపయోగించే కలప మంటల్లో దగ్ధమైంది. మంటలు ఇతర గడ్డివాములకు వ్యాపించే ప్రమాదం ఉండటంతో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అధికారి వసంత్ నాయక్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సిబ్బంది ఈశ్వరయ్య, రవినాయక్, దాదాపీరా తిప్పయ్య తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.ఈ ప్రమాదంలో పశుగ్రాసం, కలప తదితరాలు దగ్ధమై రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు దొడ్లో శివ తెలిపారు. అసలే పశువులకు మేత కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో పశుగ్రాసం దగ్ధం కావడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు ఇతర గడ్డివాములకు వ్యాపించకుండా సకాలంలో గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

## గుత్తిలో గణేశ్ ఉత్సవ కమిటీ మండపాల నిర్వాహకులతో సమా వేశం

**-గుత్తి సీఐ రామారావు**

గుత్తి పోలీస్ స్టేషన్లో మంగళవారం గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు,మం డపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు.వినాయక వేడుక లను ప్రశాంతంగా నిర్వహించుకోవా లని,వేడుకల పేరుతో గొడవలు పడి తే కఠిన చర్యలు తప్పవని సీఐ రా మారావు హెచ్చరించారు.వినాయక చవితి పండుగ మండపాల గురించి మరియు వాటి నిర్వహణ,తీసుకోవ లసిన జాగ్రత్తలు,నిమజ్జనం యొక్క జాగ్రత్తలు మరియు మండపాలకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీ సుకుని పోలీసు వారి యొక్క సూచ నలు పాటించవలసినదిగా తెలియ జేయడమైనది.రోడ్లకు అడ్డంగా మం డపాలు ఏర్పాటు చేయ కూడదన్నా రు.మండపాలలో రాజకీయ నాయ కులకు సంబంధించిన పాటలు పెట్ట కూడదన్నారు.ఎక్కువ శబ్దంతో సౌం డ్ సిస్టం ఉండకూడదన్నారు.



# విద్యార్థులకు ట్రాఫిక్, సైబర్ క్రైమ్‌పై అవగాహన

**- మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలి: సీఐ దేవానంద్**



**రాయదుర్గం- సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, బాల్య వివాహాలు, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, డయల్ 100, 112 అత్యవసర సేవలు, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ దేవానంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన పరిణామాలపై కూడా అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ దేవానంద్ సూచించారు. విద్యార్థుల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ తల్లిదండ్రులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సీఐ దేవానంద్ కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## మాతృ మరణాల నివారణకు

# ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలి...!

**- వైద్యులు, స్టాఫ్ నర్సులకు క్షేమకర కాన్పులపై శిక్షణ**

**- వైద్య సేవల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలకం: కలెక్టర్ ఓ ఆనంద్**




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులు, స్టాఫ్ నర్సులకు క్షేమకర కాన్పుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఎన్ని వసతులు ఉన్నప్పటికీ మాతృ సంరక్షణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం అందుబాటులో లేకపోతే వైద్య సేవల్లో పరిపూర్ణత సాధించలేమన్నారు. ముఖ్యంగా మాతృ మరణాలు అధికంగా కాన్పు సమయంలోనే సంభవిస్తున్నందున, వాటిని నివారించేందుకు వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రతి కాన్పును నిర్దేశిత వైద్య ప్రమాణాలు, ప్రోటోకాల్స్ ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణులకు సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు, అత్యవసర పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు సిబ్బందికి నిరంతర శిక్షణ అవసరమని పేర్కొన్నారు. మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు, స్టాఫ్ నర్సులు సమన్వయంతో పనిచేసి మాతృ మరణాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు.

## 24 గంటల్లోనే తప్పిపోయిన మహిళ ఆచూకీ గుర్తింపు...!

**- అనంతపురం మూడవ పట్టణ పోలీసుల ప్రత్యేక గాలింపు చర్యలు**

**- కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించిన పోలీసులు**

**- ఇన్‌స్పెక్టర్ జి.కౌలుట్లయ్యకు కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మతిస్థిమితం సరిగా లేని తప్పిపోయిన మహిళను అనంతపురం మూడవ పట్టణ పోలీసులు కేవలం 24 గంటల్లోనే గుర్తించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 40 ఏళ్ల జి. శ్రీదేవి పుట్టుకతోనే చెవిటి, మూగగా ఉండటంతో పాటు మతిస్థిమితం కూడా సరిగా లేదని పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 7న ఉదయం 8.30 గంటల సమయంలో తన అక్కతో కలిసి అనంతపురం బస్టాండ్‌కు వచ్చి కదిరి బస్సు ఎక్కారు. బస్సులో రద్దీ ఎక్కువగా ఉండటంతో శ్రీదేవి బస్సు నుంచి కిందకు దిగి పోయారు. ఆమె అక్క లగేజీ తీసుకునే సమయంలో శ్రీదేవి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో కనిపించకుండా పోయారు.దీనిపై అందిన ఫిర్యాదుకు అనంతపురం మూడవ పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. కౌలుట్లయ్య వెంటనే స్పందించి సిబ్బందితో ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర ప్రయత్నాల ఫలితంగా 24 గంటల్లోనే శ్రీదేవి ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.తమ కుటుంబ సభ్యురాలిని సురక్షితంగా తిరిగి అప్పగించిన మూడవ పట్టణ పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు చేపట్టిన వేగవంతమైన చర్యలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

## గుంతకల్లు మున్సిపల్ ఎన్నికలే వైసీపీ లక్ష్యం

**- వైసీపీ శ్రేణులకు వైవీఆర్ దిశానిర్దేశం**

**గుంతకల్ -సూర్య వాస్తవం:** గుంతకల్లు రాబోయే మున్సిపల్ ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని, ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైవీఆర్ క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై పార్టీ నాయకులు, ఆశావహ అభ్యర్థులతో దిశానిర్దేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకమై, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

